క్లుప్తంగా

రాఘవేంద్రుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మూలబృందావనం

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు గురువారం భక్తులు దేశం నలుమూలల నుంచి భారీగా తరలివచ్చారు.భక్తులు ముందుగా తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకున్నారు. అనంతరం శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మఠం అధికారులు చర్యలు చేపట్టారు.భక్తులు భారీగా తరలిరావడంతో మఠం పరిసరా ప్రాంతాలు రద్దీగా మారాయి. పీఠాధిపతి శ్రీ సుభుధేంద్రతీర్థుల ఆశీస్సులతో మూలబృందావనానికి వేకువజాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయులను చెక్క,వెండి, బంగారు,నవరత్నరథోత్సవాలపై ఊరేగించారు.

ఖాదర్‌లింగ స్వామి దర్గాకు తరలివచ్చిన భక్తులు



సమాధికి పూలు సమర్పిస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రం కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాల్ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామివారి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతెహాల్ సమర్పించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పొలాలకు హద్దులు ఏర్పాటు చేస్తాం

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని పి.తాండ గ్రామ పంచాయతీ పరిధిలో జగన్న భూ హక్కు,భూ రక్ష పథకం కింద సర్వే పూర్తయిన రైతుల పొలాలకు రాళ్లుపాతి చేసి హద్దులు ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం గ్రామానికి చేరుకున్న రా ళ్లను పరిశీలించి గ్రామస్తులకు విషయాన్ని వి వరించారు.కార్యక్రమంలో మండల సర్వేయర్ వాహిద్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.


బూదూరులో తాగునీటి ఎద్దడి

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని బూదూరుగ్రామంలో పదిరోజులుగా తాగునీటి ఎద్దడి నెలకొంది. గ్రామంలో మంచినీటిని సరఫరా చేసే మోటార్లు మరమ్మతులకు గురికావడంతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. విషయం పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదోని రూరల్: మండలంలోని ఆరేకల్‌లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆంగ్ల మాధ్యమంలో చేరేందుకు విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సునీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నామన్నారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు 5వ తరగతికి, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఇంటర మొదటి సంవత్సరానికి దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని చెప్పారు. దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ నెల 23వ తేదీ వరకు సమయం ఉందన్నారు.

బూదూరు విద్యార్థి ప్రతిభ




కురువ మల్లికార్జున

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని బూదూరు గ్రామానికి చెందిన కురువభీరప్ప, శంకరమ్మ దంపతుల కుమారుడు కురువ మల్లికార్జున ప్రతిభ చాటాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన మల్లికార్జున చిత్తురులోని అపోల్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తయిన వెంటనే నీట్ పీజీ పరీక్షల్లో 562 మార్కులు సాధించాడు. ఆల్ ఇండియా స్థాయిలో 6488వ ర్యాంకు కైవసం చేసుకున్నాడు.

ఒత్తిడిని ‘జయిద్దాం’!

- ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు
- ఉత్తమ ఫలితాలపై సర్కారు ఫోకస్
- ఒత్తిడికి గురికాకూడదంటున్న విద్యావేత్తలు



పది విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్ : కంబైన్డ్ స్టడీస్‌కు టైం వచ్చింది. నైట్ అవుట్‌లు చేసే అవసరం కనిపిస్తోంది. ఇంటర్ పరీక్షలు ఇప్పటికే మొదలయ్యాయి. టెన్త్ పరీక్షలు ముందుకొస్తున్నాయి. యేడాది అంతా ఎంత కష్టపడినా పరీక్షల ముందు రివిజన్ చేసుకుంటేనే కష్టానికి ప్రతిఫలం దక్కుతుంది. ఇలాంటి కీలక సమయంలో అనవసర ఒత్తిళ్లకు గురై కాలాన్ని వృథా చేసుకోవద్దని విద్యావేత్తలు సూచిస్తున్నారు. మొబైల్ గేమ్స్, సోషల్ మీడియా పోస్టులు, కొత్త సినిమా కబుర్లు, క్రికెట్ మ్యాచ్ విశ్లేషణలు వంటి టైంపాస్ పనులు పరీక్షల తర్వాత అయినా చేసుకోవచ్చని, ఇప్పుడు మాత్రం ఉన్న ఈ కొద్ది సమయాన్ని సంపూర్ణంగా సమర్థవంతంగా వాడుకోవాలని సూచిస్తున్నారు. విద్యార్థి లోకం పరీక్షలకు సిద్ధమవుతోంది. ఒకవైపు అధికారులు మెరుగైన ఫలితాల కోసం కార్యాచరణలు అమలు చేస్తున్నారు. ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు కూడా పూర్తిస్థాయిలో పరీక్షలకు సిద్ధమవుతున్నారు. నెలల తరబడి నేర్చుకున్న పాఠాలను ప్రణాళికాబద్ధంగా పునఃశ్చరణ చేసుకోవాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. వెనకబడిన విద్యార్థులను గుర్తించి మరింత శ్రద్ధతో పాఠ్యాంశాలు బోధించేలా చర్యలు తీసుకుంటున్నారు ఉపాధ్యాయులు.

ఏప్రిల్ 3 నుంచి 10వ తరగతి పరీక్షలు

ఇప్పటికే ఇంటర్ పబ్లిక్ పరీక్షలు మొదలయ్యాయి. పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 3వ తేదీ నుంచి మొదలు కానున్నాయి. ఏప్రిల్ 3వ తేదీ నంచి 18వ తేదీ వరకు పదో తరగతి పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. నియోజకవర్గంలో 75 ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. అందులో 46 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 2,553 మంది విద్యార్థులు, 29 ప్రైవేట్ ఉన్నత పాఠశాలల్లో 1,701 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. మొత్తం 4,254 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.

సమయాన్ని ఇలా ఉపయోగించుకోవాలి

సమయాన్ని ఎంత తెలివిగా వాడుకుంటే అంత ఎక్కువ స్కోరు చేయవచ్చు. సబ్జెక్టులు, టాపిక్ ప్రాధాన్యతను గుర్తించి ఉన్న కొద్దిపాటి సమయాన్ని విభజించి కేటాయింపు చేసుకోవాలి. పరీక్షలు దగ్గరపడే కొద్దీ చాలామంది గంటల తరబడి పుస్తకాల ముందు కూర్చొంటారు. అలాగాకుండా అప్పుడప్పుడు స్వల్ప విరామం తీసుకుంటే మెదడుపై ఒత్తిడి తగ్గుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

రివిజన్ మరవొద్దు!

విద్యార్థులు పరీక్షల సమయంలో తమకు రాని ప్రశ్నలపై ఎక్కువగా దృష్టి పెట్టి వచ్చిన వాటిని పట్టించుకోరు. ఎంతబాగా నేర్చుకున్నా సమాధానాలైనా కొన్ని రోజులకు మరిచిపోయే ప్రమాదం ఉంది. కాబట్టి విద్యార్థులు నేర్చుకున్న సమాధానాలను కూడా తరచూ రివిజన్ చేస్తుండాలి. పది సిలబస్ పూర్తి కావడంతో రివిజన్ ఎంతో ముఖ్యమని విద్యావేత్తలు చెబుతున్నారు.

ఆరోగ్యంగా ఉండాలి

ఆరోగ్యంగా ఉన్నప్పుడే పిల్లలు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయగలరు. అందువల్ల ప్రిపరేషన్‌లో పడి ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయకూడదు. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి. ప్రొటీన్లతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలి. అలాగే తగిన నిద్రతో పాటు రోజూ క్రమం తప్పకుండా కొద్ది సమయం వ్యాయామం చేయాలని వైద్యులు సూచిస్తున్నారు

ఇవి తప్పనిసరి.....

1.పాఠ్యాంశాలను పక్కాగా రివిజన్ చేసుకోవాలి.
2. కొత్త అంశాలపై వెళ్లకూడదు
3. టైం టేబుల్ సిద్ధం చేసుకుని అన్ని సబ్జెక్టులు కవర్ అయ్యేలా చూసుకోవాలి.
4. కష్టమైనా సబ్జెక్టులకు ఎక్కువ సమయం కేటాయించాలి.
5. రివిజన్‌లో ముఖ్యమైన పాయింట్లు రాసుకోవాలి.
6. పరీక్షల సమయంలో క్విక్ రివిజన్ ఎంతగానో ఉపయోగపడుతుంది.
7. పాత ప్రశ్నాపత్రాలు, మోడల్ ప్రశ్నా పత్రాలను ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి.
8. ప్రశాంతంగా రోజుకు ఆరు నుంచి ఏడు గంటలపాటు నిద్రపోవాలి.
9. పూర్తి పాజిటివ్ మైండ్ సెట్‌తో ఉండాలి.
10. సెల్‌ఫోన్‌లకు, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలి.

రాత్రిళ్లు ఎక్కువగా మేల్కోవద్దు



కష్టపడి చదవాలని రాత్రిళ్లు ఎక్కువగా మేల్కొని ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దు. చక్కటి శాఖాహారం, ఆరోగ్యవంతమైన ఆహారాన్ని భుజించాలి. సినిమాలు, టీవీలు, ఇతరత్రా పండగలు వాటన్నింటినీ కొన్ని రోజులు దూరంగా ఉంచాలి. ప్రణాళికాబద్ధంగా సమయాన్ని వినియోగించుకోవాలి. ఇతరులతో పోల్చుకుని నిరుత్సాహ పడకూడదు. విజయం సాధించబోతున్నానని భావించి ఆత్మవిశాసాన్ని పెంపొందించుకోవాలి.

– సుధాకర్, ఉపాధ్యాయుడు, సైకాలజిస్టు

చేతిరాతకు పని పెట్టాలి



రివిజన్ చేయడంతో పాటు ఆ ప్రశ్న, జవాబులను రెండు, మూడుసార్లు రాయడం ద్వారా పూర్తిస్థాయిలో గుర్తిండిపోతుంది. పరీక్షలు రాసేటప్పుడు ప్రశ్నను బాగా చదివి అర్థం చేసుకుని రాయాలి. అంతేగాకుండా రివిజన్ చేసేటప్పుడు ప్రశ్న, జవాబులను బాగా అర్థం చేసుకుని చదువాలి. అర్థమైతే మరిచిపోవడానికి వీలుండదు.

– సురేష్‌కుమార్, ఉపాధ్యాయుడు

పెద్దకడబూరులో పొలంబడి



రైతులతో మాట్లాడుతున్న ఏఓ వరప్రసాద్

పెద్దకడబూరు: పెద్దకడబూరు గ్రామంలో సాగు చేసిన వరిపైలరులో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసా యాధికారి వరప్రసాద్ రైతులకు పంటల సాగుపై సూచనలు చేశారు. వరి సాగులో పాటించాల్సిన పద్ధతలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకురాలు ఇందు, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అమలు చేయాలి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ గీతావాణి

ఆదోని రూరల్ : ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని అమలు చేయాలని ఎంపీడీఓ గీతావాణి, ఎంఈఓ శివరాములు సూచించారు. గురువారం మండలంలోని జి.హొసళ్లి, ఇస్వీ గ్రామాల్లో వారు పర్యటించి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం సచివాలయాలను సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. విధుల పట్ల ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, చంద్రశేఖర్, నాగరాజు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

54వ సారి రక్తదానం చేసిన ఎన్‌ఎస్‌ఎస్ అధికారి



రక్తదానం చేస్తున్న జొనాథన్

ఆదోని అర్బన్ : పట్టణంలోని ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ డివిజన్ అధికారి జొనాథన్ 54వ సారి రక్తదానం చేశారు. ఈ మేరకు గురువారం బసాపురం గ్రామానికి చెందిన మహేశ్వరికి కాన్పు సమయంలో రక్తం అవసరముందని డాక్టర్లు సూచించగా ఆమె భర్త విఠల్ జొనాథన్‌ను సంప్రదించారు. డిగ్రీ పరీక్షల విధి నిర్వహణలో ఉన్న ఆయన అధికారుల అనుమతి తీసుకొని ఏరియా ఆస్పత్రికి వెళ్లి రక్తదానం చేశారు. రక్తదానం చేసిన జొనాథన్‌కు బసాపురం విఠల్, మహేశ్వరి, వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

వైద్య ఖర్చులకు ఎమ్మెల్యే సాయి ఆర్థిక సాయం



రూ.50 వేలు అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని అర్బన్ : మండలంలోని దొడ్డనగేరికి చెందిన లింగమ్మ, రంగయ్య దంపతుల కుమార్తె లక్ష్మి గుండె వద్ద గుల్ల అయినందుకు ఆపరేషన్ నిమిత్తం గురువారం ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి రూ.50 వేలు అందజేశారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద బాలిక తండ్రి రంగయ్యకు నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దొడ్డనగేరి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న లక్ష్మికి గుండె వద్ద గుల్ల అయ్యి ఇన్‌ఫెక్షన్ అయ్యిందన్నారు. చికిత్స కోసం వైద్యుడిని సంప్రదించగా రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారన్నారు. అయితే ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేయించేందుకు ప్రయత్నం చేసినా అందులో ఈ ఇలాంటి సమస్యకు వర్తించదని చెప్పడంతో తనవంతుగా సాయం చేశానని తెలిపారు.

రైలులో కర్ణాటక మద్యం పట్టివేత



కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఆదోని టౌన్ : ఆదోని పట్టణం బోయగేరికి చెందిన రాజు అనే వ్యక్తితో పాటు ముగ్గురు మహిళలు గురువారం నాగర్‌కోయిల్ ఎక్స్‌ప్రెస్ రైలులో కర్ణాటక నుంచి 900 ఒరిజినల్ చాయిస్ టెట్రా ప్యాకెట్లను తీసుకొస్తుండగా సమాచారం మేరకు రైలు దిగుతుండగా రైల్వే స్టేషన్‌లో పట్టుకున్నామని ఎస్‌ఐ రామస్వామి తెలిపారు. వారి నుంచి రూ.45 వేలు విలువ చేసే కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. స్వాధీనం చేసుకున్న మద్యాన్ని స్థానిక సెబ్ పోలీసులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు.

కర్ణాటక మద్యం విక్రేతల అరెస్ట్

ఆదోని రూరల్ : మండలంలోని ఆయా గ్రామాల్లో అక్రమ కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఇస్వీ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. పెద్దహరివాణం గ్రామానికి చెందిన నక్కిల గోపాల్ అనే వ్యక్తి ఇంటి వద్ద కర్ణాటక 90ఎంఎల్ ఓసీ టెట్రా ప్యాకెట్లను ఇస్వీ హెడ్‌కానిస్టేబుల్ ఓబులేష్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అలాగే చిన్నగోనేహాల్ గ్రామంలో బోయ నామలమోహన్ నుంచి 26 ఓసీ టెట్రా ప్యాకెట్లు, బోయ బావిగడ్డ బసప్ప నుంచి 15 టెట్రా ప్యాకెట్లను గ్రామశివారులోని ఈరన్నస్వామి గుడి వద్ద స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఇస్వీ ఎస్‌ఐ విజయలక్ష్మి తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

మంటలు చెలరేగి పత్తి దగ్ధం



కాలి బూడిదైన పత్తి

కోసిగి: మండల పరిధిలోని సజ్జలగుడ్డం గ్రామానికి గుండమ్మ గారి మల్లయ్య ఇంట్లో ప్రమాదశాత్తు మంటలు చెలరేగి భారీగా ఆస్తినష్టం వాటిల్లింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు గురువారం ఉదయం మల్లయ్యగారి కుమారుడు ఇంట్లో దేవుడి గుడి వద్ద దీపం వెలిగించి శ్రీశైలం దర్శనార్థం వెళ్లాడు. కొద్ది సేపటి భార్య పొలం పనులకు వెళ్లగా ఆయన ఇంటికి తాళం వేసి పని నిమిత్తం కోసిగి వెళ్లాడు. అయితే మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఇంటిలో నుంచి పొగలు వ్యాప్తి చెందాయి. చుట్టు ప్రక్కల ప్రజల చూసి ఇంటికి వేసిన తాళం పగలకొట్టి మంటలార్పే ప్రయత్నం చేశారు. పాత ఇళ్లు కావడంతో ఇంటి మిద్దెకు కూడ మంటలు వ్యాప్తి చెందాయి. మిద్దెకు నీళ్లుపోసి పైకప్పును కూల్చాల్సి వచ్చింది. ఇంట్లో ఉన్న 16 క్వింటాళ్ల పత్తి, పొలం పత్రాలు, ఎల్ఐసీ బాండ్, రెండు తులాల బంగారు, వంటసామగ్రి కాలి బూడిదైంది. మార్కెట్‌లో పత్తికి రేటు తక్కువ ఉందని ఇంట్లోనే నిల్వ చేసి ఉంచాడు. అంతలోనే రూ.2లక్షలు విలువ పత్తి కాలిపోయింది. ఇంట్లో దేవుడి గుడివద్ద అంటించిన దీపమా లేక విద్యుత్ షాట్ షర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగిందా అనే అనుమానాలను గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నారు. బాధితుడికి ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.



ఇంటి పైకప్పును కూల్చిన దృశ్యం

అమరజీవి త్యాగాలు చిరస్మరణీయం



వైఎస్సార్ కార్యాలయం వద్ద పొట్టిశ్రీరాములు జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, పార్టీ కార్యకర్తలు, నాయకులు



మున్సిపల్ కార్యాలయంలో అమరజీవి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, ఉద్యోగులు

- ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్ : పట్టణంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. వైఎస్సార్సీపీ కార్యాలయంలో అమరజీవి చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, యువ నాయకుడు మనోజ్ కుమార్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. తెలుగు ప్రజలు నిత్యం స్మరించుకోదగిన మహానుభావుడు పొట్టిశ్రీరాములు అని అన్నారు. తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం సాధనకు 58 రోజులపాటు ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణాలు అర్పించిన త్యాగమూర్తి పొట్టి శ్రీరాములు అని పేర్కొన్నారు. ఆ మహోన్నత త్యాగం రగిలించిన స్ఫూర్తితోనే నాడు అనేక చోట్ల ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలు ఊపందుకోవడం జరిగిందన్నారు. ఫలితంగా ఎన్నో కొత్త భాషా సంయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయని గుర్తు చేశారు. అదేవిధంగా మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఆధ్వర్యంలో అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పోలకల్ రేణుక, కౌన్సిలర్లు చలపతి, సింహం నాగేంద్ర, నాయకులు అశోక్, రామక్రిష్ణ, తాయన్న, గంగాధర్, కోదండ, నాగరాజు, సిద్ధ, యేసేబు, వేణు, నల్లారెడ్డి, బాబా, చిన్నా, చిన్నఈరన్న తదితరులు పాల్గొన్నారు.

వెలుగు సీసీ, బుక్ కీపర్‌లపై చర్యలు తీసుకోవాలి

ఆదోని రూరల్: అవినీతికి పాల్పడిన వెలుగు సీసీ, బుక్ కీపర్‌పై చర్యలు తీసుకోవాలని పెద్దతుంబళం గ్రామానికి చెందిన పొదుపు సంఘం గ్రూపు సభ్యులు కోసిగి జైమాన్‌బీ, మల్లమ్మ, గంగమ్మ, సావిత్రమ్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ పొదుపు గ్రూపు సభ్యులు కంతులు చెల్లించినా పొదుపు గ్రూపు అకౌంట్‌లో డబ్బులు జమకావ డం లేదన్నారు. దీనికి కారణం వెలుగు సీసీ రామన్న, విలేజ్ బుక్ కీపర్లు అవినీతికి పాల్పడడమేనన్నారు. విషయాన్ని వెలుగు ఏపీఎం జనార్దన్ దృష్టికి తీసుకెళ్లగా సమస్య తన దృష్టికి వచ్చిందన్నారు. అవినీతికి పాల్పడితే ఉపేక్షించచమని, విచారించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రేపు ఉరుకుంద హుండీ లెక్కింపు

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి దేవాలయ హుండీని శనివారం లెక్కిస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రామాంజినేయులు తెలిపారు. హుండీని స్థానిక డార్మెంటరీ హాల్‌లో దేవాదాయశాఖ అధికారులు, పోలీసుల సమక్షంలో లెక్కిస్తున్నట్లు ఆయన తెలిపారు.

సర్వేతో ప్రతి రైతు భూమి గుర్తింపు



హద్దుల రాళ్లను పాతుతున్న రెవెన్యూ సిబ్బంది

కౌతాళం: జగనన్న శాశ్వత భూ హక్కు – భూ రక్ష పథకం కింద రీ సర్వే అయినందున ప్రతి రైతుకు భూమి గుర్తింపు వచ్చిందని తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుర్రాలదొడ్డి గ్రామంలో గురువారం రీ సర్వే అనంతరం భూములకు గుర్తింపు హద్దుల కోసం రాళ్ల పాతారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే ఆరు గ్రామాల్లో రీ సర్వే పూర్తి అయ్యిందన్నారు. ఐదు గ్రామాలకు భూములకు హద్దులు చూపించే రాళ్ల రావడంతో ఈరోజు గుర్రాలదొడ్డి గ్రామం నుంచి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. హద్దులు చూపించిన తర్వాత భూముల్లో ఎలాంటి మార్పులు ఉండవన్నారు. వంద సంవత్సరాల తర్వాత జరుగుతున్న శాశ్వత హక్కు భూ రక్ష పథకం వల్ల రైతులకు ఎంతగానో ఉపయోగకరం ఉందని, పొలాల హద్దుల కోసం ఇక నుంచి రెవెన్యూ కార్యాలయానికి తిరగాల్సిన అవసరం పూర్తగా ఉండదన్నారు. గుర్రాలదొడ్డిలో 103మంది రైతులకు గాను 266.90ఎకరాలకు సంబంధించి గురువారం రాళ్ల పాతి హద్దులు చూపించినట్లు తెలిపారు. ఈ ఏడాది చివరికంత మండలంలో 35 రెవెన్యూ గ్రామాల్లో జగనన్న శాశ్వత భూ హక్కు మరియు భూ రక్ష పథకం క్రింద రీ సర్వే పూర్తి అవుతుందన్నారు. ఆరు గ్రామాల్లో 1316 మంది రైతులకు గాను 1280 మంది రైతులకు భూ హక్కు పత్రాలను మంజూరు చేసి వీఆర్‌ఓల ద్వారా పంపిణీ కూడా చేయించడం జరిగిందని వివరించారు.

పాముకాటుతో బాలుడు మృతి



మృతిచెందిన బాలుడు శివరాజ్

ఆదోని అర్బన్: మండలంలోని పెద్దతుంబళం గ్రామానికి చెందిన ఉరుకుందప్ప కుమారుడు శివరాజ్(07) గురువారం పాముకాటుకు గురై మృతిచెందాడు. బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నా ఐ. రాత్రి ఇంటి వద్ద ఆడుతుండగా పాము కాటు వేసిందని, వెంటనే నాటువైద్యుడి వద్దకు వెళ్లామన్నారు. అనంతరం ఆదోని ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు చికిత్సలు చేస్తుండగా మృతి చెందాడు.

22 నుంచి మల్లమ్మ పురాణ ప్రవచనం

హొళగుంద: ఎల్లార్తి గ్రామంలో ఈ నెల 22 నుంచి 26వ తేదీ వరకు ప్రతి రోజూ రాత్రి హేమరెడ్డి మల్లమ్మ పురాణ ప్రవచన కార్యక్రమం నిర్వహిస్తామని నిర్వాహకులు గురువారం తెలిపారు. వారు మాట్లాడుతూ జంగమర హొసళ్లికి చెందిన అజాత శంభులింగ శివాచార్య, పాల్తూరు చెన్నవీర శివాచార్య, రౌడకుంద శివయోగి శివాచార్య మహాస్వాములు హాజరవుతారని చెప్పారు.ముగింపు రోజు గ్రామంలోని అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, ముత్తైదువులకు సామూహిక ఒడిబియ్యం తదితర కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

‘గద్దెరాళ్ల’ హుండీ ఆదాయం లెక్కింపు

ఆలూరు: దేవనకొండ మండలంలోని గద్దెరాళ్ల గ్రామంలో మూడు రోజుల పాటు జరిగిన మారెమ్మ దేవర సందర్భంగా లభించిన కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని గురువారం ఆలయ ఈఓ బి.చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ ఏడాది హుండీ ఆదాయం రూ.14,66,667 లభించిందని ఈఓ తెలిపారు. గత ఏడాది కుంటే రూ.3,17,727లు అదనంగా సమకూరిందన్నారు.

ఆర్థిక సాయం

చిప్పగిరి: మండలంలోని గుమ్మనూరు గ్రామానికి చేందిన నిరుపేద కుటుంబానికి చెందిన హరిజన వడ్రప్ప అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గుమ్మనూరు నారాయణ రూ.10 వేలు అంత్యక్రియల నిమిత్తం అందజేశారు. కాగా అంతకుముందు వైద్య ఖర్చుల కోసం రూ.20 వేలు అందించాడని, అయినా కోలుకోలేకపోయాడని స్థానికులు పేర్కొన్నారు.

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్
ప్రాంతీయ కార్యాలయము : కర్నూలు
డోర్ నెం . # 40-307, నవగీత్ నిలయం, భాగ్యనగర్ - కర్నూలు

టెండర్ ప్రకటన

మా బ్యాంక్ కోసిగి శాఖను, నడింపాలెం ఏరియా, రంగప్పగట్టు ఏరియా మరియు సిద్దప్పపాలెం ఏరియాలకి సమీప ప్రదేశములలో, అన్ని వసతులు గల వేరొక భవనము లోనికి మార్చదలిచినాము.

ఇందు నిమిత్తము సుమారు 1200 నుండి 1600 చదరపు అడుగుల కార్పెట్ ఏరియా గల భవనము, లేదా స్వస్థలములో నిర్మించదలచిన భవనములో (ప్రాధాన్యత క్రింది అంతస్తు), 200 చదరపు అడుగుల స్ట్రాంగ్ రూమ్ (రిజర్వ్ బ్యాంక్ నియమ నిబంధనల మేరకు) మరియు పార్కింగ్ మరియు నీటి సౌకర్యం కలిగి ఉన్న భవనము అద్దెకు కావలెను.

కావున ఆసక్తి కలిగిన వారి నుండి టెండరు కోరడమైనది.

సాంకేతిక మరియు ఆర్థిక టెండరు పత్రములు బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయము, కర్నూలు నందు లభించును. పూర్తి చేసిన టెండర్లు, విడి విడి సీల్డ్ కవరులో ఉంచి, ఆ రెండింటినీ వేరొక కవరులో ఉంచి సీల్ చేసి, **తేది : 15-04-2023** లేదా అంతకన్నా ముందు, ప్రాంతీయ కార్యాలయము, కర్నూలుకు చేరునట్లు పంపవలయును.

గమనిక : టెండరు ఏ దశలో నైనా రద్దు చేసే అధికారం బ్యాంక్ వారికి కలదు

వివరములకు సంప్రదించండి :
సెల్ : **94901 58025**, ప్రాంతీయ కార్యాలయము, కర్నూలు

ఇట్లు : రీజనల్ మేనేజర్, కర్నూలు